క్లుప్తంగా

ఒలింపిక్ డే రన్‌లో పాల్గొనాలి



టీ షర్టులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంటౌన్: ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఒలింపిక్ డే రన్‌లో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీదర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఒలింపిక్ డే రన్ టీ షర్టులను ఆవిష్కరించి మాట్లాడారు. యువత క్రీడల వైపు దృష్టిని సారించాలని, ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించి మెడల్ సాధించటానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బరిగెల భూపేశ్, జాన్సన్, సుధాకర్, ఇల్లూటూరి ప్రవీణ్, పి.నాగేందర్, అక్బర్, ఇందు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ స్థలం ఆక్రమణ



ఎంఎస్‌ఎంఈకి కేటాయించిన స్థలం

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్‌బస్తీలో ఎంఎస్‌ఎంఈ కోసం కేటాయించిన ఐదు ఎకరాల స్థలం అక్కడి పేదలు ఆక్రమించారు. సోమవారం స్టేషన్‌బస్తీలోని పేదలు తరలివచ్చి తమకు ఇంటి స్థలాలు లేక కిరాయి ఇళ్లల్లో ఉండలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని పేర్కొంటూ స్థలం ఆక్రమించారు. సమాచారం అందుకున్న స్థానిక కౌన్సిలర్ మొగిలి లక్ష్మి అక్కడికి చేరుకుని ఆ స్థలం ఎంఎస్‌ఎంఈకి కేటాయించారని గుర్తు చేశారు. అయినా అక్కడి పేదలు పట్టించుకోలేదు.

ఆర్యవైశ్యుల సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

జూలూరుపాడు: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా దారా రమేశ్ విజయం సాధించడంతో జూలూరుపాడు మండల ఆర్యవైశ్యులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెండ్యాల విజయ్‌భాస్కర్‌తోపాటు ఉడతా వెంకటేశ్వరరావు, ఉడతా వేణుగోపాల్‌రావు, తొండెపు నాగమణి, పెండ్యాల రామనరసింహారావు, పెండ్యాల కృష్ణమూర్తి, తొండెపు సత్యనారాయణ, కొదుమూరి మల్లికార్జున్‌రావు, కొదుమూరి భానుప్రకాష్, కొదుమూరి కోటేశ్వరరావు, వందనపు కమలాకర్, సుబ్బారావు, ప్రసాద్‌రావు, పూర్ణచందర్‌రావు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

21పిట్ ఏరియాలో పైపులైన్లకు మరమ్మతులు



పైపులైన్లకు మరమ్మతులు చేస్తున్న సింగరేణి సిబ్బంది

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియాలో పురాతన పైపులైన్లకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. సుమారు 25 ఏళ్ల కిందట సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన పైపులైన్లు ప్రస్తుతం శిథిలమై నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. అప్పుడప్పుడూ తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఎంపీటీసీ పూనెం సురేందర్, వివిధ రాజకీయ నాయకులు ఎట్టి హరికృష్ణ, వడ్ల శ్రీనివాస్, క్లింటరోచ్, బంటు యాదగిరి తదితరులు సోమవారం ఏరియా జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. తక్షణం స్పందించిన జీఎం పైపులైన్లకు మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించడంతో వారు ఏరియాలో పర్యటించి పైపులైన్లకు మరమ్మతులు చేశారు. అడిగిన వెంటనే స్పందించిన జీఎం జాన్‌ఆనంద్‌కు ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



త్యాగానికి గుర్తుగా బక్రీద్ పండుగ జరుపుకుంటారని, ఆ దేవుడు చూపిన మార్గంలో అందరూ పయనించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రైటర్‌బస్తీ, 2 ఇంక్లైన్, సూపర్‌బజార్, గొల్లగూడెం, పాత కొత్తగూడెం, బస్టాండ్ సెంటర్, పాలకేంద్రం, కూలీలైన్, గణేశ్‌టెంపుల్, రామవరం, రుద్రంపూర్, గౌతంపూర్‌తోపాటు పాల్వంచ, ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లోని ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఎస్పీ నాయకుడు కామేశ్, కొత్వాల శ్రీనివాసరావు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, దిండిగాల రాజేందర్‌తోపాటు పలువురు నాయకులు ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

–సాక్షి నెట్‌వర్క్

భక్తిశ్రద్ధలతో బక్రీద్..



జూలూరుపాడు: ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు



కొత్తగూడెంటౌన్: రైటర్‌బస్తీలోని ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, నాయకులు



కొత్తగూడెంటౌన్: రైటర్‌బస్తీలోని ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



పాల్వంచ: ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



పాల్వంచ: బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఓఎస్డీ సాయిమనోహర్



పాల్వంచరూరల్: కిన్నెరసానిలోని మసీద్‌లో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



జూలూరుపాడు: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఈద్గా వద్ద ప్రార్థన కోసం వచ్చిన ముస్లింలు



టేకులపల్లి: ప్రార్థన చేస్తున్న ముస్లింలు



ఇల్లెందురూరల్: ఆజాద్‌నగర్ ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



టేకులపల్లి: బేతంపూడి దర్గాలో..



ఇల్లెందు: ఈద్గా వద్ద శుభాకాంక్షలు చెబుతున్న దిండిగాల రాజేందర్



సుజాతనగర్: స్థానిక ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గోవధను అడ్డుకున్న పోలీసులు

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామ పంచాయతీ నిజాంపేట గ్రామ సమీప మామిడి తోటలో గోవధను సోమవారం పోలీసులు అడ్డుకున్నారు. బీజేవైఎం కార్యకర్తల సమాచారంతో పోలీసులు మామిడితోట వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆరు గోవులను వధించగా, గోవుల మాంసాన్ని పశువైద్యుడు రాజేష్ పర్యవేక్షణలో పంచనామా నిర్వహించి పూడ్చిపెట్టామని, గోవధకు పాల్పడిన పది మందిని అదుపులోకి తీసుకున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

నంబర్–2 బస్తీలో..

ఇల్లెందు: పట్టణంలోని నంబర్–2 బస్తీలో శ్రీకృష్ణ భజన మందిర్ చుట్టూ నిత్యం 50 పశువులు విశ్రాంతి పొందుతుంటాయి. ఈ క్రమంలో ఓ గోవును వధించేందుకు ఆదివారం అర్ధరాత్రి రాత్రి 12 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి తన ఇంట్లో బంధించాడు. గమనించిన బస్తీవాసులు సామల రవితేజ, పప్పు జైన్, నరేందర్ జైన్, ముద్రగడ వంశీ, బండి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెళ్లి పశువును వదిలివేసి, బంధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ లింగయ్య తెలిపారు.

ప్రమాద ఘటనపై కేసు

ఇల్లెందు: ఇల్లెందు–మహబూబాబాద్ రోడ్‌లో నిజాంపేట సమీపంలో ఈ నెల 1న బైక్‌ను ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో సేవ్యాతండాకు చెందిన అంగోతు భిక్షపతి తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ చందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆశ్రమ పాఠశాలలో చెట్ల నరికివేత



ఆశ్రమ పాఠశాలలో నరికిన చెట్ల దుంగలు

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం ఆశ్రమ పాఠశాల ఆవరణలోని చెట్లను నరికేశారు. మరో వైపు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్ స్తంభం నేలకొరిగింది. కాగా, ఈ నెల 12వ తేదీ నుంచే పాఠశాలలు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ ఆ స్తంభాన్ని, దుంగలను పట్టించుకోకపోవడం గమనార్హం.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్/ఇల్లెందు: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. సోమవారం ఇఫ్టూ కార్యాలయంలో ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పంచాయతీ వర్కర్లకు వేతనాలను సకాలంలో చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెకు సంఘీబావం ప్రకటించి ఇచ్చిన హామీలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జటంగి వెంకన్న, నాయకులు తోడేటి నాగేశ్వరరావు, డి.ప్రసాద్, మల్లికార్జున్‌రావు, నరాటి వెంకన్న, సరికొండ నాగేశ్వరరావు, బిచ్చు, యశోద, నర్సింహారావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం



జూలూరుపాడు: నగదు అందజేస్తున్న ధర్మరాజుల వెంకటనారాయణ



పాల్వంచరూరల్: పూజలు చేస్తున్న దాతలు చల్లా వెంకటేశ్వర్లు, సురేఖ దంపతులు

జూలూరుపాడు: పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. సోమవారం పాపకొల్లు గ్రామానికి చెందిన ధర్మరాజుల వెంకటనారాయణ స్వామి విగ్రహ నిర్మాణానికి రూ.25,116 విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు, గ్రామపెద్దలకు అందజేశాడు. కార్యక్రమంలో బానోత్ స్వాతి, రోకటి రంగారావు, మద్దిశెట్టి వెంకటేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, పూసాల శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమెరికాలో చదువుతున్న పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన చల్లా సాయిహేమంత్ వర్మ తల్లిదండ్రులు చల్లా వెంకటేశ్వర్లు, సురేఖ దంపతులు సోమవారం రూ.10,116 అందజేసినట్లు ఆలయ ఈఓ తెలిపారు. దాతలకు అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దోమల మందు పిచికారీ

టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం దోమల నివారణకు మందును పిచికారీ చేశారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాయ్స్ గురుకులం, కేజీబీవీ, సెల్ఫ్ మేనేజ్‌మెంట్ బాలుర, బాలికల వసతి గృహం, బద్దుతండాలోని ఏకలవ్య గురుకులం, కోయగూడెం ఆశ్రమ పాఠశాలల్లో దోమల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, భద్రయ్య, సంతు, చైతన్య, భరత్, సైదులు, ధనసరి రాంబాబు, రమాకుమారి, స్వప్న, చంద్రకళ, లక్ష్మి, మంగ, కవిత తదితరులు పాల్గొన్నారు.



మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

కార్పొరేట్ శాలరీ అకౌంట్లుగా మార్చుకోండి

ఇల్లెందు: సింగరేణి ఉద్యోగులు తమ బ్యాంకు ఖాతాలను కార్పొరేట్ శాలరీ అకౌంట్లుగా మార్చుకోవాలని ఏరియా జీఎం జాన్ ఆనంద్ సోమవారం తెలిపారు. బ్యాంకు అకౌంట్లు మార్చుకుంటే ఏదైనా ప్రమాదం జరిగితే రూ.1.15 కోట్ల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. అకౌంటు మార్చుకున్న వారికే ఈ ప్రమాదబీమా వర్తిస్తుందని, మార్చుకోని వారు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు.

సీనియర్ న్యాయవాది మృతికి నివాళి

కొత్తగూడెంటౌన్: సీనియర్ న్యాయవాది నిమ్మల సోమిరెడ్డి మృతిచెందగా సోమవారం పలువురు న్యాయవాదులు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు. సోమిరెడ్డి నివాసంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఐలు జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్ మక్కడ్ పూలమాల వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు, కార్యదర్శి ఎంఎస్ఆర్ రవిచంద్ర, జిల్లా కోశాధికారి కిలారు పురుషోత్తంరావు, వీవీ సుధాకర్ రావు, గాజుల రామ్మూర్తి, వి.పురుషోత్తమరావు, వై.బాబూరావు, సింగ్ ఉపేందర్, ఎస్‌వీ రామారావు, సంకుభాపన అనుదీప్ పాల్గొన్నారు.

సీఐని కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

ఇల్లెందు: ఇల్లెందు సీఐగా బాధ్యతలు చేపట్టిన బత్తుల సత్యనారాయణను సోమవారం బీఆర్‌ఎస్ నేతలు పోలీస్ స్టేషన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపారు. సీఐని కలిసిన వారిలో దిండిగాల రాజేందర్, పరుచూరి వెంకటేశ్వరరావు, లకావత్ దేవీలాల్‌నాయక్, కౌన్సిలర్ జేకే శ్రీనివాస్, పద్మావతి, ఆదూరి రవి, గిన్నారపు రాజేశ్, నబీ, హరిప్రసాద్, సన రాజేశ్, జబ్బార్, పోషం, రవి, రాజశేఖర్ ఉన్నారు.

ముగ్గురిపై కేసు

పాల్వంచ: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై పాల్వంచ పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గాంధీనగర్‌కు చెందిన సంధ్యారాణికి, కొత్తగూడెం రుద్రంపూర్‌కు చెందిన చల్లా శివనారాయణతో 2020లో వివాహమైంది. వివాహ సమయాన రూ.5.5 లక్షల నగదు, 150 గజాల స్థలం, ఇతర సామగ్రి ఇచ్చినా ఏడాది కాలంగా మరో రూ.5 లక్షలు కట్నం తీసుకురావాలని సంధ్యారాణిని భర్త శివనారాయణ, అత్తమామలు సరిత, వెంకటేశ్వర్లు వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.రాము తెలిపారు.

దీనావస్థలో క్రీడా ప్రాంగణం



పిచ్చిమొక్కలతో నిండిపోయిన వాకింగ్ ట్రాక్

- అస్తవ్యస్తంగా వాకింగ్ ట్రాక్, చెత్తాచెదారంతో నిండిన పార్క్
- అయినా పట్టింపులేనట్లుగా అధికారులు..

కొత్తగూడెంటౌన్: అందరికి ఉపయోగ పడాల్సిన క్రీడా ప్రాంగణం అంతా చెత్త చెదారంతో అస్తవ్యస్తంగా అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. చిన్నా పెద్ద అందరికీ ఆహ్లాదం పంచాల్సిన రామవరం క్లబ్ ఏరియాలోని క్రీడా ప్రాంగణం మందుబాబులకు, అసాంఘిక శక్తులకు నిలయంగా మారింది. కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం 6వ వార్డు క్లబ్ ఏరియా రామచంద్ర డిగ్రీ కళాశాలలోని క్రీడా ప్రాంగణం ప్రజలకు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వాల్సింది పోయి అశాంతిని ఇస్తోందని.. అసాంఘిక శక్తులు రాత్రి పూట మద్యం సేవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది కిందట రూ.50 లక్షలతో..

క్రీడా పాంగణంలో క్రీడాకారులు ప్రాక్టీస్ చేస్తారు. ఉద్యోగులు, యువతీ, యువకులు, పెద్దలు ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వస్తారు. ఇక్కడికి రామవరంలోని క్లబ్ ఏరియా, పటేల్‌బస్తీ, 2 ఇంక్‌లైన్, 7 నంబర్ బజార్లకు చెందిన ప్రజలు వాకింగ్, జాగింగ్, ఉల్లాసం కోసం వస్తుంటారు. 2023 ఏడాదిలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో ఈ క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులు మొదలు పెట్టారు. రెండేళ్లయినా నిర్మాణ పనులు పూర్తికాకుండా ఇంకా కొన్ని పనులు నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఇప్పుడు క్రీడా ప్రాంగణంతో పాటు పార్కు అస్తవ్యస్తంగా తయారు కావడంతో కొన్నినెలలుగా ఇక్కడికి ఎవరూ రావడం లేదు. క్రీడా ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. కానీ, అంతా మద్యం బాటిళ్ల పగలకొట్టి ఉండటం, గుట్కాలు తిని ఉమ్మివేయం, గుంతలు, గుంతలుగా, చెత్త చెదారంతో నిండి నడవడానికి వీలు లేకుండా తయారైందని, అదే విధంగా పార్కులో ఉల్లాసంగా గడిపేందుకు నిర్మించిన చిన్న చిన్న నిర్మాణాలు అపరిశుభ్రంగా మారాయని, మొక్కలు, చెట్ల కొమ్మలు ఎక్కడ పడితే అక్కడ క్రీడా ప్రాంగణంలో చెల్లా చెదురుగా పడి ఉన్నాయని పలువురు చెబుతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా మందుబాబులు ఇక్కడ మద్యం సేవిస్తుండటం, మందు సీసాలను పగులకొట్టడంతో అంతా దుర్గంధంతో పాటు అపరిశుభ్రంగా మారింది. రాత్రి 7 గంటల నుంచి ఇక్కడ మందుబాబులు వీరంగం చేస్తారని, ఇతర అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని, రాత్రుళ్లు వెళ్లాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా పాంగణం, పార్క్, వాకింగ్ ట్రాక్ బాగు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. పోలీసులు ప్రతి రోజు పెట్రోలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అందుబాటులోకి తీసుకొస్తాం



రామవరం 6వ వార్డులోని క్లబ్ ఏరియాలో ఉన్న క్రీడా ప్రాంగణాన్ని బాగు చేయించి ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రాంగణంలోని పార్కును, వాకింగ్ ట్రాక్‌ను బాగు చేసి, పరిశుభ్రంగా మార్చి అందరూ సద్వినియోగం చేసుకునేలా పనులు చేయిస్తాం.

–శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

వాకింగ్ ట్రాక్ బాగు చేయించాలి



రామవరం క్లబ్ ఏరియాలోని క్రీడా ప్రాంగణంలో వాకింగ్ కోసం ఏర్పాటు చేసిన ట్రాక్ అంతా అస్తవ్యస్తంగా మారింది. మాకు ఏ మాత్రం ఉపయోగకరంగా లేదు. అంతా గుంతల మయంగా మారింది. ఎన్ని సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాగు చేయించాలి.

–సత్యనారాయణ, రామవరం

చెత్తతో అపరిశుభ్రంగా మారింది..



రామవరం క్లబ్ ఏరియాలోని క్రీడా ప్రాంగణంలో క్రీడల ప్రాక్టీస్, వాకింగ్ కోసం చిన్నా, పెద్ద వస్తుంటారు. ఏడాది కాలంగా అంతా చెత్తా చెదారంతో నిండి ఉండటంతో ఇప్పుడు రావాలంటే రాలేని పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాన్ని బాగు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

–అర్జున్, రామవరం